# విడాకులు

యర్రంశెట్టి శాయి



శేషగిరి క్కోపమొచ్చింది. అతనికోపం రాకూడదని కాదు. కాని ఇంతకుముందెప్పుడూ—చిన్నప్పుడు అమ్మమ్మ తన్న కిష్టంలేని మధ్య పాపిడితో తల దువ్వినప్పుడూ—పెద్దయింతర్వాత 'నా కిష్టంలేదే' అని మొత్తుకుంటున్నా వినకుండా ఇంట్లో అందరూ కలిసి మావయ్య కూతురు చిట్టిని తనకిచ్చి వివాహం చేసినప్పుడూ—ఇంకా ఇలాంటివి బోలెడన్నాయాలు, తనకి జరిగినప్పుడు కూడా అతని క్కోపంరాలేదు. కాని దేనికయినా ఓ 'లిమిట్' వుంటుందని శేషగిరి మధ్యే ఓ పుస్తకంలో చదివాడు. చిట్టి తన మధ్య ప్రవర్తిస్తోన్న విధం ఆ 'లిమిట్' దాటిపోయుంటుందని అనుమానం రాగానే శేషగిరి క్కోపం వచ్చింది. కాని ఈ సంగతి అతను చాలా సేపటివరకూ గ్రహించుకోలేదు. మరేదో విషయంగురించి అద్దంలో మొఖం చూసుకొంటూంటే ఓ మూల అప్పుడే రాజు కొంటున్నకోపం కనిపించింది. కళ్లు నులుముకొని మళ్లీ చూశాడు. నిజమే! తను కోపంగావున్నాడు. వెంటనే చావిట్లో ఓ కుర్చీలో కూలబడి మరింతకోపం తెచ్చుకున్నాడు...ఇక లాభంలేదు. ఈవిడతో కాపరం చేయడం తనవల్ల కాదు. తన వల్లేమిటి? ఆత్మగౌరవమంటూ తగలడిన ఏ మొగాడూ ఈలాంటి ఆడదానితో కాపరం చెయ్యడు... చెయ్యడేమిటి ?... చెయ్యలేడు. సువర్ణాక్షరాలతో కాపోయినా ఇండియన్ ఇంకుతో రాసిస్తాడు తను. ఇప్పుడనికాదు. పెళ్లికాకముందునుంచే దాని సంగతి తనకు బాగా తెలుసు. మహా గర్వం. తనకంటె తెలివిగల పిల్ల ఆంధ్రాయూనివర్శిటీలోనే లేదుట. పి. యు. సి లో వెధవ సెకండ్ క్లాసులో పాసయేటప్పటికి ఇంత గర్వం పట్టుకొంది దానికి. అదే ఇయర్ అదే పి. యు. సి లో ఫస్టుక్లాస్ తెచ్చుకొన్న తను

ఏమిడిసిపోటూలేకుండా మామూలుగావున్నాడు. ...పోనీలే! ఏదో చిన్నపిల్ల, పెళ్లయిం తర్వాత గర్వం పోకపోతుందా అనుకొన్నాడు తను. కాని గర్వం పోలేదు సరికదా దానికి తోడు పెంకితనం కూడా కలిసి ఆ రెండు ఆయుధాలతో తనని ఉయ్యాల్లో వేసిన పాపాయిలా ఆడించేస్తోంది. (ఇంకా నయం! గిలక్కాయలు కొనిపెట్టేదు) అసలు దాని వన్నీ అత్తయ్య బుద్ధులే! తనకి బాగా తెలుసు...చిన్నప్పుడు తనూ చూశేడు కదా! అత్తయ్య కూడా మావయ్యని ఇలాగే డాన్సు చేయించేసేది. ఇంతకీ 'చిట్టి'వని ఏంలాభం? దాన్ని ఇంత గారాబంగా పెంచి ఇంత రౌడీతనం నేర్పేసిన మావయ్యనీ, ముఖ్యంగా అత్తయ్యనీ పొంత్రాణి పొగవేసి మరీ తిట్టాలి. తనకావన్నాతగాపోతే ... తెలసిన వాళ్లన్నలుగుర్ని పిలిచి తిట్టించాలి

శేషగిరి విసురుగా ఇంటోంచి రోడ్‌మీద కొచ్చాడు. సాయింత్రం ఆరున్నరయిపోయింది. చంద్రుడు అప్పటికే బోలెడు వెన్నెల గుమ్మరించేశాడు. ప్రక్కింటి సుబ్బిగాడూ, వాడి భార్యా షైరుకి బయల్దేరారు. వాడి చేసుకున్న అదృష్టం అది. సరదాగా కబుర్లు చెప్పుకొంటూ జీవితం హాయిగా చెరుగ్గడ తింటున్నట్లు గడిపేస్తున్నారు. పెళ్లవక ముందు తనూ ఎన్నో అనుకొన్నాడు. తన పెళ్లాం 'చిట్టి' కంటే ఇంకా బావుండాలనీ, చాలావరకూ తను చెప్పేట్లే వినాలనీ, రోజూ సాయింత్రం తనాఫీసునుంచి వచ్చేసరికి కాఫీ కంపెనీవాడి ఎడ్వర్‌టయిజ్‌మెంటులా, చక్కగా తయారయి తప్పనిండా కాఫీ అందిస్తూండాలనీ. ఆ తరువాత పిక్చర్‌కో, పార్కుకో షైరు కొట్టేయాలనీ...ఇంకా ఎన్నో వెధవ...కోరికలు... ఆనవాలుకూడా మిగలకుండా మర్చిపోయాడు. రోజూ సాయింత్రం కాఫీ తయారుంచదు సరికదా ...చాలాసార్లు తనతోనే ఇంటికొచ్చాక ఇద్దరికక్కలిపి కాఫీ కాయించింది. తలకొప్పని వంక. సాయింత్రంపూట మొగుడిగాడితో షైరు కెళ్లడం ఓల్డు ఫాషనట...ఇప్పుడు ఆడాళ్లొక్కళ్లే వెళ్లాలట! అంటే పెళ్లి జేసుగొని దానితో సరదాగా తిరగడానిక్కూడా పనికిరాని సన్యాసయిపోయాడన్న మాట తను. అసలు దాన్సనాల్సిన పనిగూడా లేదు. ఈ కాలపు ఆడపిల్లల చదువులూ తగలడిపోయినయి. అమ్మమ్మ చెప్తూంటుంది. తను ఇప్పటికీ, ఇన్నేళ్ల కాపరం తర్వాత గూడా తాతయ్యని తకీమని గుర్తు పట్టలేదుట కారణం! ఆ రోజుల్లో మొగుడంటే అంత రెస్పెక్ట్, వాల్యూ ఏడిచినయి మొగుడెదురుగా నిలబడితే తలెత్తి చూసేవాళ్లేకాదుట. దూరాన్నుంచీ అతగాడికి తెలీకుండా చూడ్డవేనట! తను జవాబిచ్చేడు అమ్మమ్మకి 'నిజవేనే అమ్మమ్మా! ఆరోజుల్లో మొగుడంటే భయపడి చూసేవాళ్లు కారు. ఈ రోజుల్లో మొగుడంటే చవక, చులకన అయిపోయి చూడటంలేదు.' అని అది విని చిట్టి ఫక్కున నవ్వి 'మీరు చెప్పింది నిజవే'నంది. పోనీలే, చదువుతానందిగదా అని, పెళ్లయినా, తను చదివింది పి యు సి యే అయినా, దాన్ని బి ఏ. లో చేర్పడానికి వెనకాడలేదు తను. ఆ సంగతి విని తాతయ్య నోరు తెరచేశాడు. అమ్మమ్మ దవళ్లు పీకేసుకొంది. అమ్మా నాన్నా సరేసరి! 'సునుతీశతకం'లాంటి ఓ నీతుల పుస్తకం రచించి తనకి ఉత్తరంగా వ్రాశేశారు.

వీళ్ళందర్నీ నోరు మూయించేసి, ఆవిడ గారిని కాలేజీలో చేర్పించే సరికి, బి. ఏ. పాసయిన రెండోరోజు నుంచే తనెందుకూ పనికిరాని ఎల్డీసీగా చూశేది లెఖ్ఖచెయ్యడం మానేసింది. తనకంటే ఆవిడ చదువూ, అందువల్లనే తెలివితేటలూ ఎక్కువని దీని అభిప్రాయం కాని తనని బి. ఏలో చేర్చినది బందరు సీ కోస్టంత విశాల హృదయంగల ఈ ఎల్డీసీ గాడేనన్న సంగతి మర్చిపోయింది. అక్కడినుంచి రోజు కో ఆర్డర్ పాస్ చేస్తోంది ఇంట్లో! కాఫీహోటలుకి పోడం మానెయ్యాలి! సిగరెట్లు త్రాగ్గూడదు! శ్లాక్‌షర్టు వాడకూడదు, ఫ్రెండ్సుతో రోడ్లమీద బాతాఖానీ కొట్టగూడదు. సాయింత్రం ఆరయేలోపల ఇంట్లోవుండాలి. సెకండ్‌షోకి పోకూడదు. ప్రొద్దున్నే బెడ్ కాఫీ త్రాగ్గూడదు. ఇంకా బోలెడు బోడి ఆర్డర్లు. పోనీలే ప్రతి ఆడదీ పెళ్లవక ముందు 'నా మొగుడిలా వుండాలి' అని వూహించుకోడం సహజం గదా! వాళ్ల కీ కొన్ని అభిరుచు లుంటయి అని ఆవిడ చెప్పినట్లే నడుచుకొంటున్నాడు తను.

రాను రాను తనని పెళ్లాంలా చూసేసి ఆవిడ గారేమో మొగుడులా ఫోజు కొట్టేస్తోంది. తన బట్టలుగూడా తను కొనుక్కోడానికి వీలులేదు. మొన్న దసరాకి ఆవిడే కొనేసి ఆ దవాళ్ల టైలర్‌దగ్గరే తన షర్టూ, పాంట్సూ కుట్టించేసింది. వాడు వాటిని, జాకెట్లూ లంగాల్లా కుట్టేశాడు. ఆఫీసులో ప్రతివాడూ తనని ఒహటే ఏడిపించడం...'మా గ్గూడా ఆ టైలర్ ని చూపించు గురూ!' అని. ఛ.. ఛ... ఏమయినా సరే...దానితో కాపరం చెయ్యడం ఇక తనవల్ల ఏమాత్రం కాదు ... విడాకులిచ్చి పారేయాలి... విడాకులు - డైవర్స్ ... అవును ఇస్తే తప్పేముంది ? ఏమీలేదు. మహారాజులా ఇచ్చెయ్యొచ్చు! మహారాజు విడాకు లిస్తాడా ? వాడెలాపోతే తనకేం ?... తను ఇచ్చేస్తే సరి! గిరి వెంటనే అయిదేళ్ల నుంచి లా చదువుతున్న రాంజీదగ్గరకు బయల్దేరాడు. రాంజీరావు బజార్లో 'ఎక్సరే' క్లినిక్ ముందు నుంచొని ప్రక్కనున్న మరోహ చిరంజీవికి ఆట్టే నవ్వురాని జోకులు చెబుతున్నాడు.

'గురో! అర్జంటు!' అన్నాడు గిరి.

'పద!' అన్నాడు రాంజీ ప్రక్కనున్న హోటల్లోకి దారితీస్తూ, చిరంజీవి ఆఖరి జోకుకి గట్టిగా నవ్వేసి 'వస్తానూర్! రేపిక్కడే కల్సుకొంటానని' వెళ్లిపోయాడు ... ఇద్దరికీ స్పెషల్‌కాఫీ ఆర్డరిచ్చి రాంజీరావుకో సిగరెట్టిచ్చి, వెలిగించుకో నగ్గి పెట్టెచ్చి, అడిగాడు గిరి 'గురో! విడాకు లివ్వాలి! ఎలా ?'

'ఇచ్చేసెయ్యి...కాని...ఎవరికి ?'

'ఎవరికేమిట్రా నా వైఫ్ కే! లేపోతే మరోడిభార్య కిస్తావేమిటి ?'

'మీ ఆవి డొప్పుగుందా ?'

'అదేమిటి ? ఆదొప్పుగునేదేమిటి ? ఇచ్చేవాడి న్నేగదా ?'

'ఊహూ! 'లా' వప్పుకోదు?'

గిరికి రాంజీమీదా, వాడు చదువుతున్న 'లా' మీద వళ్లు మండిపోయింది.

'మన కుపయోగం లేని 'లా' నువ్వు చదివేం ? చదవకేం ? రేపే మానెయ్!' అన్నాడు కోపంగా!

'ఒరేయ్ అలా గోల్చెయ్యకు. 'లా' వప్పుకోదన్నాను గాని మీ ఆవిడొప్పుకోదన్లేదుగా!' ఆవి డొప్పించేందుకు బోలెడు చిట్కాలున్నయి. పెళ్లయిన ఏమొగాడయినా అడుగు! కిలోల్లెక్క అమ్మతాడవి! అంతెందుకు ? మన బాచిపేటు వీధిలాగే పెడన శంకరంగాడేం చేశాడు ? చక్కగా విడాకు

వచ్చాడు. ఎలా? వాళ్లావిడకేం ఇష్టమయ్యా? ఏంగాదు. పైగా విడాకులిచ్చి సంవత్సరమయినా ఇప్పటికీ వాడంటే పడి చస్తుంది. అలాంటి ఆవిడకి విడాకులెలా ఇచ్చాడు...సింపుల్! ఉన్నట్టుండి ఓరోజు ఆ వూళ్లో డాన్సుచేసే 'బంగారు'ని ఇంటికి తీసుకొచ్చాడు. అంతటితో వదలక దాన్ని 'నువ్వేనా పెళ్లామన్నాడు.' పోనీ లే మన కెందుకని వాళ్లావిడ పాతివ్రత్య ధర్మం నిర్వర్తించబోయింది కాని మనవాడు ఊరుకుంటేగా! మరోరోజు తెల్లారు ఝామున భార్యని నిద్రలేపి 'నువ్వు నా పెళ్లానివి గాదు పో'మ్మన్నాడు.

'తొందరగా పో! తెల్లారితే అందరూ నిన్ను నాయింట్లో చూస్తే నీ పరువే పోతుందని' తొందర్చేశాడు. ఆవిడ లబోదిబోమంటూ చంటాడ్ని చంకనేసుకొని పుట్టింటికి పరుగెత్తుకెళ్లి వాళ్ల నాన్నని పంపించింది. అయితేమాత్రం, శంకరంగాడు జంకాడా 'మావయ్యా! అత్తయ్యతో ఇన్నేళ్ళు ఎలా కాపరం చేశావో నా కర్థం కావడంలేదు ఇప్పటికయినా మించిపోయింది లేదు. వెంటనే విడాకులికి అప్లై చేసుకోమంటూ' ఆయనిగ్గాడా విడాకుల జ్ఞానం ప్రసాదించబోయాడు. ఆయన అదిరిపోయి 'బాబూ! నా కూతురు కాపురం పోతే పోయింది...నీతో కాసేపు మాట్లాడితే నా కాపురం గూడా పోతుందం'టూ సైకిల్ రిక్షా ఎక్కి వెనక్కి తిరిగి చూడకుండా వెళిపోయాడు. ఆ తరువాత శంకరంగాడు విడాకులకి దావావేసి గెల్చుకొన్నాడు. అదీ సంగతి

ఇకపోతే ... మన వీధిలో రిక్షాలాగే ఉప్పరి వీరిగాడు వాడి పెళ్లాం రత్తితో పోట్లాడి విడాకులిస్తానని కూర్చున్నాడు. రత్తి ఒప్పుకోలేదు. రత్తి ఒప్పుగోందే నీల్లే దన్నాడు కులం పెద్ద అప్పుడేం చేశాడు?... నీలా చాతకాని వెధవలా కూచున్నాడా? లేదు. లేచి నుంచున్నాడు. ప్రక్కవీధిలోని వాసిగాడి సారా కొట్లో జొరబడి పీకల వరకూ త్రాగాడు. త్రాగి వాళ్లావిడని కొడతానికి బయల్దేరాడు. రోజూ అలా త్రాగొచ్చి చావగొడుతూంటే విడాకులివ్వక ఛస్తుందా అని వాడి ధైర్యం. కాని రత్తి అంతకుముందే త్రాగేసి వాడినే చితగ్గొట్టి ఇంట్లో పడేసింది...అది వేరే సంగతనుకో! కాని...నేజెప్పేది...ఇలా ఎన్ని చిట్కాలు లేవు? లక్ష! అన్నీ విని ఆవిడ కిష్టంలేని పన్లే జేస్తుంటే విడాకు లొద్దంటానికి ఆవిడేం సీతాదేవా? కాదుగదా!'

గిరి బుర్రగోక్కున్నాడు. 'నిజమేగురూ! మళ్లీ కనబడ్తా'నంటూ చల్లారి పోయిన కాఫీ గడగడ త్రాగేసి, బిల్లిచ్చేసి బయటకు పరుగెత్తాడు.

'నిజమే! తనూ చిట్టికి ఇష్టంలేని పన్లన్నీ జేయాలి! సిగిరెట్లు గొలుసు కట్టుగా తాగేయాలి. ఇష్టం వచ్చినప్పుడల్లా నాయర్ హోటల్లో కాఫీ త్రాగేయాలి. ఇష్టం లేపోయినా త్రాగేయాలి. క్రాఫ్ షర్ట్సు కుట్టించేసి, పూటకోటి తొడిగెయ్యాలి, ఎదురింటి రూములో కాలేజీ కుర్రాడిలా పిచ్చికగూడు క్రాఫింగ్ పెట్టేయాలి. సారా కూడా త్రాగెయ్యాలి.

గిరి వెంటనే వాసిగాడి సారా కొట్టువేపు నడిచాడు.

అక్కడ బోలెడు మంది నుంఛొని సారా గ్లాసుల్లో తీసుకొని 'కూల్ డ్రింక్'లా త్రాగేస్తున్నారు. ఒహాడో మూల కూర్చొని దూరంగా వున్న ఖాళీ గ్లాసుని దగ్గరకు పిలుస్తున్నాడు 'దా! దావే! నిన్నేంచేయను. . రా! రావూ!.. హయ్యో రావేమే!' అంటూ క్రిందపడి ఏడ్చేశాడు.

గిరికా సీను బోలెడంత అసహ్యం వేసింది. ఓ గ్లాసులో తనూ అందుకొని నోటి దగ్గర ఉంచుకొన్నాడు. అసహ్యమయిన వాసన. తిప్పేస్తోంది. కొద్దిగా చొక్కామీద వలికించి మిగతాది విసిరవతల పారేసి ఇంటికి బయల్దేరాడు. దోవలో ఓ సిగిరేట్ పాకెట్, అగ్గిపెట్టె కొని జేబులో వేసుకొన్నాడు త్రాగిన వాళ్లందరూ తూలిపోతూ నడుస్తారు. తనూ అలాగే నడవాలి. ఇంటి గేటు తీసుకొని తూలుకొంటూ లోపలికి నడిచాడతను.

చిట్టి దీపం ముందు కూచొని పత్రిక చదువుకొంటోంది.

'ఐ...లావ్...యూ...' అంటూ గాఠిగా ఇంగ్లీషులో పాడేశాడు గిరి.

చిట్టి గమనించినట్లు లేదు. పత్రికలో ఏదో సీరియల్ చదువుతున్నట్లుంది. చాలా సీరియస్‌గా వుంది. సిగరెట్టు వెలిగించి పొగ గుప్పున ఆమె ముఖంమీదికి వదిలాడు. ఆమె ఏమీ మాట్లాడలేదు. కనీసం చూడనుకూడాలేదు. ఆమె రెండు భుజాలూ పట్టుకొని లేవనెత్తి మళ్లీ 'అయ్...లా...వ్ యూ!' అంటూ మరి కొంచం గట్టిగా పాడేశాడు.

'ఛీ! పాడు!' అందామె వదిలించుకొని. అంతేగాని ఏమీ ఆశ్చర్యపోలేదు. పైపెచ్చు మళ్లీ పత్రిక చదువుకోసాగింది. ఈసారి గిరి ఆశ్చర్యపోయాడు.

తరువాత బోలెడు కోప్పడిపోయాడు. 'తను త్రాగి చచ్చినా దీనికేం ఫరవాలేదన్న మాట!' మళ్లీ సిగిరెట్టు పొగ ఆమె కళ్లల్లోకి వదిలాడు.

లేచినుంచుం దామె.

'నా...కే...వి...అక్కర్లేదు...' అన్నాడు అచ్చం త్రాగినవాడిలాగే.

కొద్దిగా తూలి గోడపట్టుకొని నుంచున్నాడు.

'అన్నం తినకుండా వుండకూడదు!' అంది చిట్టి నవ్వుతూ.

'నా యిష్టం!...నేను నీకు విడాకు లిస్తాను! వీధి చివరి శిత్రనాజాగారి మొగుడు లేని మూడో అమ్మాయిని పెళ్లి చేసుకొంటాను' అన్నాడు ఉక్రోషంగా.

'మూడోఅమ్మాయి నిగాపోతే శిత్రనాజునే చేసుకోండి! ఎవరొద్దన్నారూ?' అంటూ లోనికి నడిచిందామె.

హబ్బే! ఇలా లాభంలేదు...ఓ రెండు తగల్నియ్యాలి. అనుకొంటూ వెనుకే నడిచాడు. ఆమె భోజనం వడ్డిస్తూంటే కొట్టేద్దామని చెయ్యెత్తాడు. కాని హటాత్తుగా ఆమె వెనక్కు తిరిగేసరికి ఏమీ ఎరగనివాడిలా చెయ్యి దించేసి నుంచున్నాడు. ఊహూ! ఇదీ లాభంలేదు. ఇంకోటేదయినా చెయ్యాలి.

భోజనం చేసేసి గదిలోకి పోయి పడుకొన్నాడు గిరి.

చిట్టి వంటింట్లో గిన్నెలు సర్దుతోంది.

ప్రక్కింటి బాబాయి. వాళ్ళ చంటాడు ఇల్లెగిరేట్లు ఏడుస్తుంటే, అంతకంటె హెచ్చు స్థాయిలో జోలపాట పాడుతున్నాడు.




# విడాకులు

అంటే పిన్నిగారు, పిల్లల్నీ, బాబాయినీ ఇంట్లో వదిలేసి సినిమాకెళ్ళిపోయిందన్న మాట! అంచేత ఆ యిల్లు ఓ వియత్నాంలా వుంది.

గిరికి ముందస్తుగా పిన్నిగారి మీద మూడువందలపదకొండోసారి కోపం వచ్చింది. ఆ తరువాత బాబాయిమీద సరిగ్గా అన్నే సార్లే జాలివేసింది. ఆ పిన్నితో ఎలా నెగ్గుకొస్తున్నాడో గిరికి తెలియని రెండు విషయాల్లో ఒకటి (రెండోది చిట్టి వయసు) పాపం! పిన్ని బాబాయిని భర్తలా చూడదు. భార్యలా చూస్తుంది

తను అనేకసార్లు అడిగాడు బాబాయిని 'ఎలా బాబాయ్!...ఎలా సహిస్తున్నావు పాపం!' అని. బాబాయి పిన్ని ఎదురుగా నవ్వినట్లే నిస్సహాయంగా నవ్వాడు

'చూడు గిరీ! నీ కెలా అనిపిస్తుందో కాని నాకు మా ఆవిడతో .కలిసిమెలిసి పనిచేయడంలో చాలా ఆనందంగావుంటుంది. మొగుడూ పెళ్ళాలన్నతర్వాత ..ఆ మాత్రం .. కోపరేషన్ వుండాలోయ్ ... ఒక్కటి !... అప్పుడప్పుడు మా ఆవిడ విద్యార్థుల మీద పోలీసుల్లా.. ,కొద్దిగా అథార్టీ చేస్తూంటుందనుకో! అయితేనేం! సర్దుకుపోడమంటే నాకు సరదా!...'

ప్రక్కింటి పిన్నిగారితో పోలిస్తే చిట్టి ఓ దేవతనుకోవల్సిందే! తనంటే ఎంత ప్రేమని? అసలెంత ప్రేమలేపోతే,తనెక్కడ కష్టపడిపోతాడోనని తన పన్లన్నీ గూడా ఆవిడే చూసేస్తోంది? తనని సిగరెట్లు తాగొద్దని నిషేధం తెచ్చింది తనారోగ్యం గురించేకదా!అయినా నిజవేలెస్తూ! సిగిరెట్లు త్రాగి త్రాగేకదా, ఎలక్షన్లో గెలచిన వాయుధుగారు 'ఇప్పుడే వస్తానని చెప్పి భార్యతో, మళ్ళీ రాకుండా పైకెళ్ళిపోయింది! బెడ్ కాఫీగూడా అలాంటి వెధవలవాటే! శ్లాక్ షర్టు తనకి అంత సూట్‌గావని, తను కాలేజి చదివేరోజుల్లో, స్టూడెంట్స్ యూనియన్ సెక్రటరీగా నుంచొన్న కాలేజ్ బ్యూటీ భవాని అప్పుడే చెప్పేసింది వెంటనే ఓ రెణ్ణెల్లపాటు తనసలు శ్లాక్‌షర్టు తొడగడం మానేశేడు. ఆ అమ్మాయికి పెళ్ళయిపోయిందని తెల్సిన తర్వాత తిరిగి తొడిగేడనుకో! అది వేరేవిషయం!

అంతెందుకు! మొన్న శనివారంసాయంత్రం తను తలనొప్పితో బాధపడుతోంటే చిట్టెంత గిజగిజ లాడిపోయిందని! తన దగ్గరే కూచొని అమృతాంజనం రుద్దుతూంది రాత్రంతా! భోజనం కూడా చేయలేదు (శనివారం రాత్రెలాగూ భోజనం చేయదనుకో!...అయితే మాత్రమేం! ఆ రోజు శనివారం కాపోయినా ఖచ్చితంగా మానేసేది! గ్యారంటీ ఇస్తాడు తను!)

'అప్పుడే నిద్రపట్టిందేమిటి ?' మంచం మీద అతనిప్రక్కనే కూర్చొంటూ అడిగింది చిట్టి.

ఉలిక్కిపడి కళ్లు విప్పాడు గిరి.

చిట్టి నవ్వుతోంది...చాలా అందంగా... కనీసం ఇంతకు ముందెప్పుడూ తను చూడనంత అందంగా !

ఆమెను, దగ్గరకు లాక్కొని అడిగాడు గిరి 'ఇందాక నన్ను చూస్తే నీకు భయం వేయలేదూ ?'

గట్టిగా నవ్వేసింది చిట్టి 'హాయ్! భలేవారే! భయం ఎందుకు?'

'ఎందుకేమిటి...సారా త్రాగినట్లు బ్రహ్మాండంగా ఏక్టేసేయలేదూ?...'

'ఓహో! మీకంత ధైర్యం లేదని నాకు తెలీదేమిటి?. అదీగాక మీ స్నేహితుడు రాంజీగారు మీరొచ్చే అరగంట ముందు వచ్చి 'చెల్లాయ్! వాడివాళ చాలా హుషారుగా వున్నాడు నువ్వేం భయపడకని' చెప్పి వెళ్ళిపోయారు.

'హారి! రాస్కెల్...' రాంజీరావు మీద కోప్పడి పోయాడు గిరి.

'అయినా...మన విషయాలన్నీ ఆయనకు చెప్పేయటాలేమిటి...ఏదయినా పొరపాటుంటే నన్నే అడగొచ్చుకదా!'

'అబ్బే! హి ... హి... ఏం పొరపాటుందనీ!... ఛఛ ...ఊరికే, సరదా కన్నాను వాడితో!... నీ అంత మంచి అమ్మాయి'...

'హుష్! పొగడొద్దు!' అతని గుండెల మీద తలవుంచేసి తృప్తిగా కళ్లు మూసుకొందామె !

గిరి రోజులానే భగవంతుడిని ప్రార్థించుకొన్నాడు. 'ఎందుగ్గురూగరూ! ఇంత దృష్టం నాకు' ●


మొటిమలు, పులిపిరి,
చెమట కాయలు
మరియు
సాధారణ చర్మ వ్యాధులకు




నికో
క్రిమినాశక సబ్బు

నికో ఋజువు కాబడిన అసలైన క్రిమిసంహారక సబ్బు. నికో మూడు విధముల లాభాన్నిస్తుంది—శుభ్రత, దుర్వాయువు నాశనం మరియు రక్షణ—మీ చర్మాన్ని శుభ్రంగాను, ఆరోగ్యంగాను ఉంచుతుంది. మరియు మొటిమలు, పులిపిరి, సాధారణమైన ఇతర చర్మవ్యాధుల నుండి కాపాడుతుంది. నికోతో స్నానం చెమటకాయల చికాకును తొలగించి తాజాగా ఉండేటట్లు చేస్తుంది.



నికో యొక్క షాంపూ ప్రయోగం: షాంపూగా వరుసగా వాడితే, నికో లోని క్రిమినాశక మురుగు చుండ్రు రాకుండా చేస్తుంది—తల చర్మాన్ని స్వల్పమైన అంటువ్యాధులు సోకకుండా ఉంచుతుంది.



నికో యొక్క దుర్గంధనాశక ప్రయోగం: నికో తో స్నానం శరీరపు దుర్గంధము నుండి రక్షిస్తుంది. నికో, సాధారణమైన సబ్బులు మరియు దుర్గంధనాశక పదార్థాల వలెకాక, దుర్గంధాన్ని కలిగించే సూక్ష్మ విషక్రిములను అమోఘంగా నాశనం చేస్తుంది... మీరు తాజాగాను పరిశుభ్రంగాను ఉండేటట్లు చేస్తుంది.

ప్రతిదినం-మీ చర్మానికి తగినంత జాగ్రత్తను ఇవ్వండి

నికో—పార్కె-డేవిస్ ఉత్పత్తి

NAS 6517b